# చేజార్చుకున్న స్వర్గం



చెన్న సుశీలారామం

ఉదయం తొమ్మిది గంటలవుతోంది. హడావుడిగా తయారవుతున్నాడు రమేష్. "అదేంట్రా! అప్పుడే రెడీ అవుతున్నావు? రోజూ తొమ్మిదిన్నరకు గదా బయల్దేరేవాడివి?"

"ఒరే కార్తీక్! అవి పూర్వం రోజుల్రా... మా కొత్త మేనేజరు చాలా స్ట్రిక్టు. టైం మెయిన్‌టైన్ చెయ్యకపోతే... వూరుకోదు".

"ఒహో... లేడీ మేనేజరు వచ్చిందని చెప్పావు గదూ? కొత్త పిచ్చోడు పొద్దెరగడన్న సామెతలా... ప్రమోషన్ మీద వచ్చిన మీ మేనేజరు మేడంకి... కోతికి కొబ్బరికాయ దొరికినట్టు సంబరంగా వుంటుంది. అందుకే అలా ఫోజు కొడుతూ, హంగామా చేస్తోంది. చూస్తుండు నాలుగు రోజులు గడిచేసరికి, ఆవిడగారే, లేటుగా రావడం మొదలెడ్తుంది. ఈ ఆడ మళయాళం ఫోజులు, టెక్కులు నాకు తెలుసు గదా...."

"ఒరే కార్తీక్! ఆవిడ గురించి అలా మాట్లాడకురా... అవిడ వర్క్ విషయంలో, ఎంత స్ట్రిక్టుగా డిసిప్లెన్డ్‌గా వున్నా... మనిషి మాత్రం చాలా మంచిది...."

"ఏంటిరో.... మీ మేనేజర్ని అప్పుడే కాకా పట్టే పన్లో పడ్డావా? లేక.... చాలా అందంగా వుంటుందంటున్నావు.... లైనేస్తున్నావా? ఐనా నాకు మేరేజ్ సెటిలై పోయిందిగదరా... పోనీలే... ఈలోపు ఎంజాయ్ చెయ్యి...."

"చా... నోర్మెయ్యి.... ఆవిడకు పెళ్ళైపోయిందిరా... ఆవిడ గురించి తప్పుగా మాట్లాడినా ఆలోచించినా కళ్ళు పోతాయిరా... సరే... నేను వెళ్తాను. నా మేరేజ్‌కి ఓ పది, పదిహేను రోజులు, లీవ్ శాంక్షన్ చెయ్యమని అడగాలి..."

"రమేష్... నీతో మాట్లాడాలిరా... ఇప్పుడు వీలు పడదు, అని అనకు... స్కూటర్ మీద ఫాస్ట్‌గా వెళ్తే ఇరవై నిమిషాల్లో బేంక్‌లో వుంటావు. కనుక ఒక్క పదినిమిషాలు, అలా కూచొని, నే చెప్పేది విను. ఒరే... నేను ఎంత కాలమని నీ మీధ అధారపడి బతకన్రా? నా పరిస్థితి చూస్తే అగమ్యగోచరంగా వుంది. ఎక్కడికెళ్ళినా పని లేదు పొమ్మనవాళ్ళే..."

"కార్తీక్! నువ్వన్నది నిజమే... ఇంతకాలం నేనొక్కడ్నే గనక సరిపోయింది. వచ్చే నెల్లో నాకు పెళ్ళి జరుగుతుంది. నా భార్య వచ్చాక.... ఇప్పట్లా నిన్ను నా దగ్గర వుంచుకోవడం కుదరదురా... ఈ మాట నీకెలా చెప్పాలా అని సతమతమవుతున్నాను" నసుగుతూ చెప్పాడు రమేష్.

"రమేష్! ఇంతవరకూ నన్ను భరించినందుకు నీకెంతో రుణపడి వున్నాన్రా... రేపట్నుంచి నా దారి నేను చూసుకుంటాను".

స్నేహితుడి పరిస్థితికి రమేష్ ఎంతో నొచ్చుకున్నాడు. "కార్తీక్... మా మేనేజరు మేడం చాలా మంచిది. పోనీ, నువ్వు ఓసారి వచ్చి అవిడ్ని కలవకూడదూ? నేను కూడా నీకు సపోర్టుగా మాట్లాడతాను. మా బ్యాంక్‌లోనే ఆ పని, ఈ పని చేస్తూ ఆవిడ దగ్గర విశ్వాసంగా నడుచుకుంటుంటే... ఆమెకు చాలా మంది కస్టమర్స్‌తో పరిచయం వుంటుంది గనుక... నిన్ను రికమండ్ చేసి ఎవరి దగ్గరైనా పని ఇప్పిస్తుంది. ఈ రోజే మా బ్యాంక్‌కి రాకూడదూ!"

❊ ❊ ❊

మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో...

[illegible] కార్తీక్. "రారా... మా మేడం [illegible] తీరిగ్గా వున్నారు... పద... ఆవిడ [illegible]కెళ్దాం..." కార్తీక్‌ని తీసుకుని, మేనేజరు క్యాబిన్‌లో కెళ్లాడు రమేష్.

లోపలికెళ్లగానే, ఇద్దరూ మేనేజర్‌ని విష్ చేశారు. టేబుల్ మీదున్న పేపర్లు చూస్తున్నదల్లా, తల పైకెత్తి చూసింది కావేరి.

"మేడం... వీడు నా బెస్ట్ ఫ్రెండ్...."

"కావేరిని చూసిన కార్తీక్, నోట మాట రాక దిగ్భ్రాంతికి వుండిపోయాడు... మీరు.... మీరు.. మీ పేరు కావేరి కదూ?"

ఈసారి ఆశ్చర్యపడటం ఆవిడ వంతైంది... అవును... నా పేరు మీకెలా తెలుసు? ఇంతకీ మీరెవరు? ఇంతకు మునుపు మిమ్మల్నెక్కడా చూసినట్టు లేదు..."

ఇంకా షాక్ నుంచి కోలుకోని కార్తీక్ వెంటనే నోరు విప్పలేదు.

"మేడం... వీడి పేరు కార్తీక్.... వూరు పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు... ఈ వయసుకే వీడు... పడరాని పాట్లన్నీ పడ్డాడు..."

అతన్ని మధ్యలోనే ఆపింది కావేరి... "స్టాప్... స్టాప్... మిస్టర్ రమేష్.... మీ ఫ్రెండ్ పడ్డ పాట్లేవిటో నేను చెప్పనా?" వెటకారంగా అడిగింది. ఇంక అక్కడ నిలబల్లేక, చివుక్కున వెనుదిరిగి బైట పడ్డాడు కార్తీక్.

అయోమయావస్థకు గురైన రమేష్.... "ఎక్స్యూజ్‌మీ మేడం... ఇప్పుడే వస్తాను...." అంటూ కార్తీక్ వెనకే బైటకొచ్చేశాడు. అప్పటికే బ్యాంక్ బైటకొచ్చేసిన కార్తీక్‌ని వేగంగా వెళ్ళి అడ్డుకున్నాడు.

"ఏంట్రా... ఏంటిదంతా? ఆవిడ పేరు నీకెలా తెలుసు? ఆవిడతో నీకు ముందే పరిచయం వుందా? నీ గురించి కూడా ఆమె తెలిసున్నట్టు మాట్లాడుతోంది... నాకంతా అయోమయంగా వుంది. అసలు విషయమేంటో త్వరగా చెప్పరా.... నాకు తెగ సస్పెన్సుగా వుంది" స్నేహితుణ్ణి బలవంతం చేశాడు.

"ఒరే రమేష్! ఇప్పుడు నన్నేం అడక్కు. ఏదీ చెప్పే మూడ్‌లో లేను నేను. నేను ఇంటికెళ్ళిపోతున్నాను... అక్కడ్నుంచి వడివడిగా వెళ్ళిపోయాడు కార్తీక్.

ఎలా ఇంటికొచ్చి పడ్డాడో... అతనికే తెలీదు... అతని చెవుల్లో జెట్ విమానం పోతున్నంత రోదగానూ... తల్లో నరాలు చిట్లిపోతున్నట్లుగానూ... ఒళ్లంతా చచ్చుబడిపోయినట్టుగా వుంది.... గదిలో నేలమీద వాలిపోయాడు కార్తీక్.

"కావేరి... కావేరి... బ్యాంక్ మేనేజర్‌గా చేస్తుందా? మనిషిలో అప్పటికీ, ఇప్పటికీ ఏ మాత్రం మార్పు రాలేదు. కొత్తగా కళ్లకు జోడు వచ్చింది. అది కూడా అదనపు అలంకారంగానే వుంది ఆమెకు. కడిగిన ముత్యంలా... బాపు గీసిన బొమ్మలా.... దివి నుంచి అప్సరసలా వుంటుంది కావేరి. ఆ అప్సరస తన సొంతం కావాల్సింది... కాని, కాని, తనే చేజేతులా.... చేజార్చుకున్నాడు... అతని మస్తిష్కం గతంలోకి పరుగుపెట్టింది.

✻ ✻ ✻

ఆ రోజు వీధి లోంచి ఇంటికొస్తూనే.... తండ్రిని గట్టిగా పిలిచాడు కార్తీక్.... "నాన్నా!.... నాన్నా!"

చేతిలో వున్న భగవద్గీత పక్కనే పెట్టి లేచి, తన గదిలోంచి, హాల్లోకొచ్చాడు భగవాన్లు.

"నాన్నా... నేను ఆఫీసు నుంచి వస్తుంటే... బజార్లో దామోదరం కనిపించాడు... "ఉత్సాహంగా చెబుతున్న కొడుకును ప్రశ్నార్థకంగా చూశాడు భగవాన్లు.

"అబ్బా... నీకు ఇంత మతిమరుపు వచ్చేసిందేమిటి నాన్నా...? దామోదరాన్ని అప్పుడే మర్చిపోయావా?"

"ఒరే అబ్బాయి... నాకు వయసు పైబడిపోయింది... ఇప్పుడు చెప్పిందే... ఇంకాస్సేపటికి మర్చిపోతున్నాను... మరి ఈ దామోదరం ఎవరు? అతగాడి గురించి నాకు ఎప్పుడు చెప్పావు? ఏమని చెప్పావు? ఆ కథాకమామిషు...."

తండ్రి మాటల్ని మధ్యలోనే అడ్డుకున్నాడు కార్తీక్... "నాన్నా! నీకు కథాకమామిషులు వినిపించడానికి... నాకిప్పుడు ఓపికలేదు గాని.... ఆ దామోదరం గురించి క్లుప్తంగా చెబుతాను విను.... భూపతిని, రంగరాజుని, డేవిడ్‌ని... మలేషియా పంపించాడని, చెప్పానే.. ఆ దామోదరం ఇప్పుడు బజార్లో కలిసాడు. అతను మలేషియా పంపిన ముగ్గురూ అక్కడ లక్షలు సంపాదిస్తున్నారట. "ఏంటయ్యా! నువ్విక్కడ గొర్రె తోకలాంటి ఈ ఉద్యోగం పట్టుకుని వేళ్లాడుతున్నావు? వయసులో వున్నప్పుడే... నాలుగు డబ్బులు సంపాదించుకుని, వెనకేసుకోవాలి. నేను మలేషియా పంపిన వాళ్లంతా లక్షలు గడించుకుని వచ్చి ఇక్కడ పెద్ద పెద్ద బిజినెస్‌లు చేసుకుంటూ, ఎంతో ఎత్తులో వున్నారు. నువ్వు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వున్నట్టు బతుకుతావా? నీకు

## బాలీవుడ్-హాలీవుడ్‌ల సంగతి

అమెరికాలో హాలీవుడ్ ఎలాగో ఒకప్పటి బొంబాయి (ఇప్పుడు ముంబయి) కూడా అలాగే! అందుకనే అక్కడి సినిమా పరిశ్రమకి 'బాలీవుడ్' అన్న పేరు వచ్చింది!

ప్రస్తుతం ఒక అమెరికా డాలరు 48 భారతీయ రూపాయల కన్నా ఎక్కువ విలువ కలిగి ఉంది. కాని అమెరికాలో ఒక డాలరుకి భారతదేశంలో ఒక రూపాయికి ఉన్న కొనుగోలు శక్తి 48 రెట్లు ఉండదు. కొనుగోలు శక్తి బహుశ అయిదు లేదా ఆరు రెట్లు ఉంటుందేమో!

ఏది ఎలాగ ఉన్నా ఈ మధ్య సుప్రసిద్ధ అమెరికా వాణిజ్య వారపత్రిక "బిసినెస్ వీక్"లో అక్కడా, ఇక్కడా సినిమా నిర్మాణం ఖర్చుల వివరాలు డాలరులలో మాత్రమే ఇవ్వటం జరిగింది.

ఆ పత్రికలో పడిన ఒక పట్టీ ఈ కింది విధంగా ఉంది:

| బాలీవుడ్ | | హాలీవుడ్ |
|---|---|---|
| 1013 | నిర్మిత చిత్రాల సంఖ్య (2001) | 739 |
| 36 లక్షలు | అమ్ముడుపోయిన టిక్కెట్లు | 26 లక్షలు |
| 13 లక్షలు | ప్రపంచం మొత్తం మీద ఆదాయాలు (2002) | 510 లక్షలు |
| 15 లక్షలు | సగటు నిర్మాణం ఖర్చు | 477 లక్షలు |
| 12.6 శాతం | సాలీన పెరుగుదల | 5-6 శాతం |
| 5 లక్షలు | ఒక చిత్రానికి సగటు మార్కెటింగ్ వ్యయం | 273 లక్షలు |

✻ ప్రపంచం మొత్తం మీద ఆదాయాల అంకెలు అంచనాలు మాత్రమే -

సమ్మతమైతే చెప్పు.... నిన్ను కూడా మలేషియా పంపే ఏర్పాట్లు చేస్తాను... ఏదో మనం మనం ఓ క్యాస్ట్ వాళ్ళం గనుక.... ఆ అభిమానం కొద్దీ నీకిలాంటి అవకాశం ఇవ్వాలనుకుంటున్నాను... అన్నాడు నాన్నా" ఉత్సాహంగా చెప్పుకు పోతున్నాడు కార్తీక్.

భగవాన్లు ముఖంలోకి వెలుగొచ్చేసింది.... "ఒరేయ్‌బాబూ! నువ్వు తక్షణం మలేషియా వెళ్లే ప్రయత్నం చెయ్యరా... దామోదరాన్ని పట్టుకుని నువ్వు మలేషియా వెళ్ళి డబ్బు సంపాదించు కొచ్చావంటే... మన దరిద్రం తీరిపోయి, రాజాల్లా దర్జాగా బతికెయ్యవచ్చు. ఇంకా అలస్యం చెయ్యకు. లేకపోతే నీకు దక్కాల్సిన బంగారం లాంటి అవకాశాన్ని వేరే వాడు తన్నుకుపోగలడు... ఐనా... ఇందాకే దామోదరానికి నీ అంగీకారం చెప్పెయ్యక, ఇంటికెళ్ళి మా నాన్నతో ఆలోచించుకొస్తానని చెప్పావా ఏంటి? ఇలాంటి విషయాల్లో జాగు పనికిరాదురా... ఊఁ తక్షణం దామోదరం దగ్గరకెళ్ళు... ఆగాగు... నీతో నేను కూడా వస్తాను.... అతగాడి దగ్గరకు... " హడావుడి పడిపోతున్నాడు భగవాన్లు.

"నాన్నా! ఏంటా హడావుడి? నేనిలా వెళ్లగానే అలా ఫ్లైట్ ఎక్కించేస్తాడనుకుంటున్నావా దామోదరం? దానికి చాలా ఖర్చువుతుంది. అందరికీ ఐతే... లక్ష... నాక్కాబట్టి ఎనభైవేలు తీసుకుంటానన్నాడు. తెలిసిందా?"

పొంగుతున్న పాల మీద నీళ్లు చిలకరించినట్లు... భగవాన్లు సంతోషం ఒక్కసారిగా చప్పబడిపోయింది. "ఎనభైవేలా? అంత డబ్బు మన దగ్గర లేదు గదరా?" వుసూరుమంది అతని మనసు.

"లేదని నాకు తెలీదా?" ఎక్కడో ఒక్కచోట సంపాదించి, అంత డబ్బు దామోదరం చేతిలో పెడితేనే పని జరుగుతుంది."

నిట్టూరుస్తూ అక్కడున్న కుర్చీలో కూలబడ్డాడు భగవాన్లు. కార్తీక్ కూడా తండ్రి పక్కనున్న కుర్చీలో చతికిలబడ్డాడు.

"ఇప్పుడు మన దగ్గర అంత డబ్బు లేదు. ఇక్కడ మనకు అంత డబ్బు అప్పుగా ఇచ్చే నాథుడు లేడు. కానీ నీ అత్తవార్ని అడగరా..." కొడుక్కి సలహా ఇచ్చాడు భగవాన్లు...

"అత్తవారా? ఇంకా పెళ్లి కాలేదు గదా..."

"అందుకే... ఇప్పుడే వాళ్లను డిమాండ్ చేయాలి..."

"డిమాండ్ చేస్తే... ఇస్తారంటావా నాన్నా?"

"చచ్చినట్టు ఇచ్చి తీర్తారు..."

"ఒకవేళ అంత పైకం వాళ్ళు సర్దుబాటు చేయలేమంటే?"

"వాజమ్మలా మాట్లాడకు. కాబోయే అల్లుడి హోదాలో వెళ్లి అడిగితే.... తల తాకట్టు పెట్టైనా సరే ఇచ్చి తీరతారు. అల్లుడా... మజాకా? కాదు... కూడదు... మేం ఇవ్వలేమన్నారనుకో... పదిరోజుల్లో జరగబోయే పెళ్లి క్యాన్సిల్ అను... చచ్చినట్టు మనదారికొస్తారు... ఇప్పటి మార్కెట్ బట్టి... నువ్వు మూడు లక్షలన్నా పలుకుతావురా అబ్బాయ్... ఘొలతాడు కట్టి మగాడైతే చాలు... వాడికి ఏం వుండనీ... లేకపోనీ... క్యూలో నిలబడి అమ్మాయి తల్లిదండ్రులు పెళ్లి కొడుకుల్ని ఎగరేసుకుపోతున్నారు... కంగారు పడకురా... నిదానించరా, అంటే నా మాట లక్ష్య పెట్టావా? పిల్ల రంభలా వుందని... వాళ్లిచ్చే ముష్టి కట్నానికి తలొంచావు. అప్పుడు నిన్ను ఏ శనిదేవతో అవహించి వుంటుంది... ఆ పిల్ల తప్పించి నీ కంటికేవీ ఆనలేదప్పుడు. ఇప్పుడు చూడు. ఎలాంటి చిక్కొచ్చిపడిందో? ఇప్పటికైనా మించిపోయింది లేదు. వాళ్లు మనం అడిగిన డబ్బు ఇవ్వలేమంటే... తక్షణం నేను పెళ్ళిళ్ళ పేరయ్యను కలిసి రెండు లక్షలు పైచిలుకు కట్నం వచ్చే సంబంధాన్ని వారం తిరక్కుండానే సెటిల్ చేస్తాను. అప్పుడు నీకింక ఏ సమస్యా ఉండదు. ఇంక ఆలస్యం చెయ్యకు.... వూళ్లోనే గనక, వెంటనే నీక్కాబోయే అత్తారింటికెళ్లి మాట్లాడిరా. శుభశ్య శీఘ్రం అన్నారు పెద్దలు..." కొడుకుని తొందరపెట్టాడు.

"అలాగే నాన్నా.... ఇప్పుడే వెళ్తాను...." చెబుతూనే లేచి, చెప్పులేసుకుని వీధిలోకెళ్లిపోయాడు కార్తీక్.

* * *

"ఎవరూ... అల్లుడు గారా... రండి బాబూ రండి... ఇలా వచ్చి కూర్చోండి. ఏవోయ్ రత్నమాణిక్యం... అల్లుడు గారొచ్చారు.... వెంటనే ఏదన్నా మంచి టిఫిన్ చేసి పట్టుకురా... అమ్మాయ్ కావేరీ!... ఇలా రామ్మా" తెగ హడావుడి పడిపోతున్నాడు కార్తీక్‌కు కాబోయే మామ మంగారావుగారు... లోపల్నుంచి రత్నమాణిక్యం వచ్చి అల్లుడ్ని పలుకరించి వెళ్ళింది. గుమ్మం చాటు నుంచి తొంగి చూస్తూ... సిగ్గుల మొగ్గే అయ్యింది కావేరి.

కుర్చీలో కూర్చున్నాక విషయం వివరించాడు కార్తీక్.


గుండె గుభిల్లుమంది ముసలాయనకు. ఏం మాట్లాడాలో తోచక, కిమ్మనకుండా వుండి పోయాడు. అసహనంగా కుర్చీలో కదిలాడు కార్తీక్.

"ఏంటండీ! అలా వుండిపోయారు? మాట పలుకు లేకుండా వున్నారు....ఏమిటి దీనికర్థం? మీ అల్లుడు మలేషియా వెళ్లి లక్షలు గడించుకొస్తే మీకు మాత్రం సంతోషం గాదూ?"

## చెట్టు

చెట్టు తల్లిలాంటిది
రోగార్తులకు ఔషధులిచ్చి సేవ చేస్తుంది
ముక్కలుగా నరికినా
జీవితం చాలించి నిర్జీవంగా మారినా
జీవం లేని మానవ శరీర దహనం చేసి
మోక్షాన్నిస్తుంది!!
చెట్టు అమ్మలాంటిది
నిండు ఆకుల కొమ్మలతో ఆహ్వానించి
ఫలాలిచ్చి, నీ ఆకలి తీరుస్తుంది.
నీ వేదనల బాధలకు
తన సుగంధ వీచికలతో
ఉపశమనం కలిగిస్తుంది.
ఆ మాతృదేవతను
గౌరవించి పెంచితే
జాతిని మనసారా దీవించి
సుసంపన్నం చేస్తుంది॥

-చివుకుల రామేశ్వర్



"[illegible] బాబూ? కాని, పరుగెత్తి [illegible] నిలబడి నీళ్ళు త్రాగడం [illegible] మీరే ఆలోచించండి..." నసుగుతూ [illegible] మంగారావు.

"ఇది పోటీ ప్రపంచమండీ! చదువుల్లోనేంటి ఉద్యోగాల్లోనేంటి... వ్యాపార్లోనేంటి... అందరికీ, పరుగు పందెంలాంటిదే.... ఆ పందెంలో ఏ మాత్రం వెనుకడుగు పడిందా... వాడ్ని అట్టడుక్కి నెట్టేసి.... ఆ వెనకనున్నవాడు ముందుకు దూసుకుపోతాడు. ఏదో. నేను తెలిసున్నవాడ్ని... ఒకే కులం వాడ్ని గనక.... ఆ దామోదరం నాకీ అవకాశం కల్పిస్తున్నాడు కాని... బంగారం లాంటి ఈ అవకాశం అందరికీ దొరకదండీ. ఇక్కడుంటే ఏం వుంది? జీవితమంతా చాకిరీ చేసినా, ఎదుగుబొదుగూ లేని జీతం రాళ్లతో... ఈసురోమంటూ బతకాల్సిందే. అదే... మలేషియా వెళ్లి ఓ ఐదేళ్లపాటు వుండి వచ్చాననుకోండి... జీవితాంతం కాలు మీద కాలు వేసుకుని దర్జాగా బతికెయ్యొచ్చు. నేను చెప్పాల్సిందంతా చెప్పాను. మరి... మీరెప్పుడు ఏర్పాటు చేస్తారు డబ్బు? ఎప్పుడో అంటే కుదరదు. అంతా వారం రోజుల్లో జరిగిపోవాలి. ఆపైన చాలా తతంగం వుంటుంది. మనం దామోదరానికి డబ్బు ఇచ్చేస్తే... అతని ఏర్పాట్లలో అతనుంటాడు"

వింటున్న కావేరి మనసంతా చేదు తిన్నట్లైంది. వంట గదిలో వున్న రత్నమాణిక్యం చెవిని కూడా పడ్డాయి కార్తీక్ మాటలు. ఆమెకు కంగారుగానూ, కాళ్లూ చేతూలాడ్డం లేదు. మంగారావు పరిస్థితి సరేసరి... పెళ్లి పది రోజుల్లో వుందనగా... కాబోయే అల్లుడు స్వయంగా వచ్చి అలాంటి డైనమేట్ లాంటి ప్రపోజల్ పెడితే, ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు?"

"బాబూ... నా శాయాశక్తులా, ప్రయత్నిస్తాను. మీరు కూడా మీ ప్రయత్నం మీరు చెయ్యండి. నేనెప్పుడూ ఎవరి దగ్గరా, చెయ్యి చాచి ఎరుగను. ఇక్కడ నాకు అంతగా పరిచయస్తులు కూడా లేరు. నా మీద నమ్మకం పెట్టుకోకండి..." నానుస్తూ ఇంకా ఏదో చెప్పబోతున్నాడు మంగారావు.

అప్పటికే కార్తీక్ ముఖం కళ తప్పిపోయింది. "అంటే... ఏమిటి మీ ఉద్దేశం... నీకు నేను ఏవీ ఇచ్చేది లేదని, ఇండైరెక్ట్‌గా, తెలివిగా చెప్తున్నారన్నమాట. కాబోయే అల్లుడితో మాట్లాడాల్సిన విధానం ఇలాగేనా? ఎవరి దగ్గరా, చెయ్యి చాచి ఎరగనంటారేంటి? అవసరమైతే కాళ్ల మీద పడైనా సరే... కార్యం సాధించుకురావాలి. అన్నీ నా నోటితో పలికిస్తున్నారు గానీ... ఆ మాత్రం మీకు తెలీదా? ఐనా ఎవరి దగ్గరో చెయ్యి చాచడం ఎందుకండీ? మీకు సొంత ఇల్లుంది... దాన్ని కుదవపెడితే... ఎవరైనా ఇస్తారు డబ్బు..." మామగారికి సలహా ఇచ్చాడు కార్తీక్.

"బాబూ! ఇంటి మీద ఇప్పటికే చాలా తెచ్చుకున్నాం..."

"అలాగైతే ఇల్లు అమ్మేయండి..."

అంత వరకూ, సహనంగా వున్న కావేరి... ఇంక తనని తాను కంట్రోల్ చేసుకోలేక... హాల్లో కొచ్చేసింది. "ఇల్లు అమ్మేయమని, బాగానే సలహా ఇస్తున్నారు. కాని ఆ తర్వాత మా అమ్మా నాన్నల్ని ఎక్కడ వుండమంటారో... అదీ మీరే చెప్పండి...."

కావేరి అలా తన ఎదుటకొస్తుందనిగాని, అంత ధైర్యంగా మాట్లాడుతుందని గాని, వూహించని కార్తీక్ ఖంగుతిన్నాడు. మంగారావు కంగారు పడిపోయాడు. "అమ్మా కావేరీ....! నువ్వెందుకొచ్చావిక్కడికి? ఇది పెద్దవాళ్ళ వ్యవహారం. నీ జోక్యం తగదు. నువ్వు చిన్న పిల్లవి. లోపలికెళ్లు..." కూతుర్ని గద్దించాడాయన.

"నాన్నా... నువ్వన్నట్టు నేనేం చిన్న పిల్లను గాను. డిగ్రీ కంప్లీట్ చేసిందాన్ని, మంచి చెడు తెలిసున్నదాన్ని."


"కావేరీ! నువ్వు మంచి చెడు ఎరిగిన దానివైతే ఇలా మాట్లాడవు. నువ్వు మీ అమ్మా నాన్నలకు ఒక్కగానొక్క కూతురివి. సో... ఈ ఇల్లు నీకు చెందాల్సి వుంది. ఎప్పుడో దక్కాల్సిందాన్ని ఇప్పుడు ఉపయోగించుకుందామను కుంటున్నాను. మీ అమ్మా నాన్నల్ని ఎక్కడ వుండమంటారని గదూ అడిగావు? ఈ ప్రపంచంలో అందరూ సొంత ఇళ్లల్లోనే, వుంటున్నారనుకున్నావా? డబ్బు విసిరేస్తే మనకు నచ్చిన అద్దె ఇంట్లో వుండొచ్చు. నేను మా నాన్న అద్దె ఇంట్లోనేగా వుంటుంది".

"సారీ!... ఆ పని మా నాన్న చేస్తానన్నా... దానికి నేను అంగీకరించను. ఈ ఇంటిని ఎంతో కష్టపడి కట్టుకున్నారు నా తల్లిదండ్రులు. ఓ పక్క పోర్షను అద్దెకిచ్చుకుని ఆ డబ్బుతో, తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. ఇప్పుడు మీరీ ఇంటిని అమ్మమనడం, సమంజసం గాదు. అది జరిగే పని కాదు. మీరు ఎక్కడన్నా ట్రై చేసుకోండి" నిర్మొహమాటంగా చెప్పేసింది కావేరి.

అంతే... కార్తీక్ ముఖం యాసిడ్ పోసినట్లు వికృతంగా మారింది. అల్లుడ్ని చూసి తెగ గాబరా పడిపోయాడు మంగారావు. "బాబూ!... అమ్మాయి మాటలు ఏం పట్టించుకోకండి. అమ్మాయికి నేను నచ్చ చెప్పుకుంటాను. మీరడిగినట్లు ఈ ఇల్లు అమ్మకానికి పెట్టేసి.... ఈ ఇంటి మీద తెచ్చుకున్న బాకీ పోను.... మిగిలిన డబ్బు తెచ్చి మీకిస్తాను. అవును.... మీరన్న మాట సబబుగానే వుంది. ఈ ఇల్లు, మీకు అమ్మాయికి చెందాల్సింది.. ఎప్పుడో మా తదనంతరం తీసుకోవాల్సింది... ఇప్పుడు మీ అవసరార్థం అమ్మడంలో తప్పేం లేదు..."

"నాన్నా..." కోపంగా పిలిచింది కావేరి. "నేనసలు ఈ పెళ్లే చేసుకోను. నా మాట కాదని ఈ ఇల్లు అమ్మాలనుకుంటే మాత్రం... తర్వాత విచారించాల్సొస్తుంది..."

ఆమె మాటలు కార్తీక్‌లో ఆవేశాన్ని పెంచాయి. "ఏంటీ నీ యిష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నావు? నువ్వు ఆడపిల్లవు. ఆ మాట మర్చిపోకు. ఓ సారి పెళ్లి కుదిరి... తాంబూలాలు పుచ్చుకుని పెళ్లికి ముహూర్తం నిర్ణయించాక, ఆ



పెళ్ళి ఆగిపోతే... నీకీ జన్మకు పెళ్ళి జరగదు..."

"ఏంటీ... శపిస్తున్నారా? నాకీ జన్మలో పెళ్ళి జరక్కపోయినా... నా కొచ్చే నష్టం ఏం లేదు. కానీ నా తల్లిదండ్రులకి మాత్రం నిలువ నీడ లేకుండా చెయ్యను. వాళ్లకు నేను తప్ప ఎవ్వరూ లేరు. వాళ్ల అవసానదశలో... వాళ్లను ఆదుకోవాల్సిన దాన్ని నేను... నన్ను కట్టుకోబోయే వాడు, నాక్కాబోయే భర్త ఎలాంటివాడో, నాకు తెలీదు. వున్న ఆధారాన్ని వదులుకుని, నిరాధారంగా మరొకరి దయాదాక్షిణ్యాల మీద నా వాళ్ళు ఆధారపడ్డం నాకు ఇష్టం లేదు. మీరు ఎన్ని చెప్పినా.... మా నుంచి మీకెలాంటి సహాయం అందదు"

ఉగ్రనరశింహావతారమే ఎత్తాడు కార్తీక్. విసురుగా లేచి నిలబడ్డాడు. "ఐతే నా నిర్ణయం చెబుతున్నాను. వినండి! నేను మీ ఇంటి అల్లుణ్ని కాలేను. మీ అమ్మాయికి మరో సంబంధం వెతుక్కోండి. పైపై అందాలు చూసి నా కళ్ళకి పొరలు కమ్మి మీరిచ్చే ముష్టి కట్నానికి... మీ ఇంటి అల్లుణ్ని అవుదామనుకున్నాను. కాని మీ అమ్మాయి ఇంత పొగరుబోతని ఊహించలేదూ మీ అమ్మాయికి పెళ్లెలా జరుగుతుందో నేనూ చూస్తాను" వడివడిగా బైటికెళ్ళిపోయాడు.

టిఫిన్ తయారు చేసి పట్టుకొచ్చిన రత్నమాణిక్యం, మంగారావు చేష్టలు దక్కి వుండిపోయారు. "ఎంత పన్జేశావే అమ్మడూ... ముహూర్తం పెట్టుకున్నాక ఇలా జరగడం ఎంత అప్రదిష్ట... పెద్ద ముండావాణ్ని నేనేదో మాట్లాడుతుంటే... మధ్య నువ్వెందుకమ్మా కల్పించుకున్నావు? అతగాడన్నట్టు నీకు మరో సంబంధం రావడం ఎంత కష్టం?.... నీది వుడుకు రక్తం. దేన్నీ నిదానంగా ఆలోచించనివ్వదు. నిన్ను ఓ అయ్య చేతిలో పెట్టి ప్రశాంతంగా కృష్ణా, రామా అనుకుంటూ వుందామని ఆశపడ్డాం. నువ్విలా చేశావు..." నిస్తేజంగా కుర్చీలో కూలబడిపోయాడు మంగారావు.

రత్నమాణిక్యం, భర్త దగ్గరకొచ్చి అతని భుజం మీద, వూరడింపుగా చెయ్యి వేసింది. "ఏమండీ! ఏది జరిగినా, మన మంచికే అనుకోండి. అమ్మాయి చదువుకుంది. మనకంటే బాగా ఆలోచించగలదు. ఐనా... అమ్మడు వున్న మాటేగా అన్నది? వున్న ఆధారాన్ని కాస్తా ఇప్పుడే చేజార్చుకుంటే... కన్నవాళ్ల ఆలనా, పాలనా పట్టించుకోకుండా ఆనాధల్లా రోడ్డు మీదికి నెట్టేస్తున్న ఈ రోజుల్లో... అల్లుడు... అత్తామామల మంచి చెడ్డలు పట్టించుకుంటాడనుకోవడం మన భ్రమే. ఈ సంవత్సరం కాకపోతే... ఆపై సంవత్సరం... లేకపోతే మరో రెండేళ్లకైనా

## నగలు

అనాకారికే కాదు  
సుందర రూపానికీ  
అవశ్యం  
సద్బుద్ధి!  
జ్ఞానం!  
విజ్ఞానం!  
విశ్వప్రేమ  
నవరత్న ఖచిత  
ఆ భరణాలు.

-మాధవరపు కృష్ణ

అమ్మాయి పెళ్లి జరక్కపోదు. మీరు అనవసరంగా ఆలోచిస్తూ బి.పి. పెంచుకోకండి. ఇంద... ఈ వుల్లి పకోడిలు తినండి... అమ్మాలూ... రామ్మా నువ్వు కూడా, టిఫిన్ తీసుకో.... ఏం చేస్తాం.... ఈ టిఫిన్ అతగాడికి ప్రాప్తం లేదు.... వూ... తీసుకోండి..... ఇద్దరికీ కాఫీ కలిపి పట్టుకొస్తాను...."

లక్షాయాభై వేలు కట్నంగా తెచ్చిన పిల్ల మెడలో తాళి కట్టించాడు తన తండ్రి. మొదటి రాత్రే బైటపడింది తన భార్యకి మూర్ఛవ్యాధి అని. తను దారుణంగా మోసగింపబడ్డాడు. అత్తామామల మీద ధ్వజమెత్తాడు. "అంతా నీ తండ్రికి తెలిసే ఇష్టపడే జరిగింది" అన్నారు వాళ్లు. ఇప్పుడు మా అమ్మాయిని ఏ మాత్రం బాధపెట్టినా... నీ మీద నీ తండ్రి మీద పోలీసు కంప్లైంట్ ఇస్తామని బెదిరించారు.

"నువ్వు మలేషియా వెళ్లేందుకు ఇంత తొందర్లో, హఠాత్తుగా డబ్బు ఎలా పుట్టుకొస్తుందనుకున్నావు?... ఆ పిల్లకి అలాంటి జబ్బుంది కనుకనే... వెనక పైసా ఆస్తి లేని నీకిచ్చి కట్టబెట్టారు. ఒరేయ్ అబ్బాయ్ నువ్వు ఇప్పుడేం మాట్లాడకుండా, మలేషియా వెళ్లు. నువ్వు తిరిగొచ్చేటప్పటికి.... దీన్ని ప్రాణాల్తో వుంచను. అదేరా... దీని మూర్ఛ రోగమే దీని ప్రాణం తీస్తుంది.... సరేనా?! నువ్వు మలేషియా నుంచి లక్షలు సంపాదించుకు రాగానే.... దర్జాగా... లక్షాధికారి ఇంటి అల్లుడివి అవుదువుగాని... సరేనా?" అంటూ తన తండ్రి తనని ఓదార్చాడు. ఆయన చెప్పింది సబబుగానే తోచింది తనకు.

బ్రోకరు దామోదరానికి డబ్బు ముట్ట జెప్పి కష్టా వూబిలో కూరుకుపోయాడు తను. ఆ దామోదరం తనని విజటర్స్ వీసాతో, మలేషియా పంపించి చేతులు దులిపేసుకున్నాడు. మలేషియా వెళ్లగానే తన వద్దనున్న పాస్‌పోర్ట్, వీసా, డబ్బులు గుంజేసుకున్నారు అక్కడున్న ఏజెంట్లు. ఎన్నో రోజులు తినడానికి తిండి, వుండడానికి గూడు లేక బాధపడ్డాడు. ఆకలికి తాళలేక... బయటికి వెళ్లి ఏదన్నా పని చేద్దామని ప్రయత్నిస్తే పోలీసులు పట్టుకుని తనని ఇమిగ్రేషన్ జైల్లో పడేశారు. భగవంతుడా! ఆ జైల్లో అనుభవించిన నరకం తలుచుకుంటుంటేనే.... ఎంతో భయంగా బాధగా వుంటుంది. ఆ జైల్లో బలవంతులైన ఖైదీలకే తిండి దొరికేది. తను టైఫాయిడ్ జ్వరంతో, ఎన్నో రోజులు బాధ పడ్డాడు. అక్కడ ఎవరికే జబ్బు వచ్చినా... ఆయుషున్న వాడు బతికి బట్టకట్టాల్సిందే తప్ప.... మందులు.... డాక్టర్ల మాట వినబడదు. ఎవరో పుణ్యాత్ముడి దయ వల్ల తను ఆ నరక కూపం నుంచి బైట పడగలిగాడు.

కాని, ఇక్కడికొచ్చాక మాత్రం తన పరిస్థితిలో మార్పేం వుంది? తన భార్య చావుక్కారణం తన తండ్రేనని కేసు పెట్టి, ఆయన్ని జైలు పాలు చేశారు తన అత్తమామలు. తను పని చేసిన కంపెనికెళ్తే.... ఇదేవన్నా గవర్నమెంటు జాబనుకున్నావా? నువ్వు ఎప్పుడొస్తే అప్పుడు నీ సీటు రెడీగా ఇవ్వడానికి? ఇది ప్రయివేటు కంపెనీ బాబూ... ఇక్కడ నీకు ఎలాంటి పని లేదు... వెళ్ళుళ్ళు... అని పంపేశారు. తన మీద జాలి దాల్చిన రమేష్ ఇంత కాలం తనని పోషించాడు. ఇప్పుడు తన పరిస్థితి పెనం మీంచి పొయ్యిలోకొచ్చి పడ్డట్టుగా వుంది. కావేరితో పెళ్ళి క్యాన్సిల్ చేసుకున్నా.... భగవంతుడు తన నోట కొట్టడానికి గుప్పెడు మట్టి పట్టుక్కూర్చున్నట్లు తనకు తెలీదు. హాయిగా కావేరిని పెళ్లాడి జాలీగా బతకాల్సిందిపోయి, అత్యాశకు వెళ్లి... లైఫ్ స్పాయిల్ చేసుకున్నాను. తనతో పెళ్ళి రద్దు చేసుకున్నాక.... కావేరి పట్టుదలగా చదివి.... ఏదో వుద్యోగం సంపాదించుకుందని.... పెళ్ళి చేసుకోని తన తల్లిదండ్రుల్ని తనతోనే తీసుకుపోయిందని మాత్రం తను తెలుసుకోగలిగాడు.... కాని, ఇంత వున్నత స్థితిలో వుందని మాత్రం ఊహించలేకపోయాడు. కావేరి పట్టుదల గల పిల్ల. దేనికీ రాజీ పడకుండా... తన భవిష్యత్తును, తానే తీర్చి దిద్దుకుంది. తనలాంటి ఆశపోతులే ఎటూ కాని స్థితిలో.... త్రిశంకు స్వర్గంలో పడికొట్టు మిట్టాడుతుంటారు. తనకీ శాస్తి జరగాల్సిందే...

'ఎవరు చేసిన ఖర్మ.... వారనుభవించక, ఎప్పుడైనా తప్పదన్నా....' ఎదురింటి రేడియోలోంచి వినిపిస్తున్న పాటకు, ఏడ్వలేక, నవ్వుకున్నాడు కార్తీక్.

❀